ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

## (రేలంగిలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 16-4-96)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఆత్మ ఒక్కటిమాత్రమే సత్యం. అది ఎవరో కాదు మనమే. ఆత్మవేరు, అనుగ్రహం వేరుకాదు. ఆత్మకు మరోపేరు అనుగ్రహం. మానవుడికి కావలసినది సుఖం. సుఖం ఎక్కడ ఉంది అంటే ఆత్మలో ఉంది. ఆత్మ ఎక్కడ ఉంది అంటే అది మన స్వరూపముగానే ఉంది. ఎవడైతే ఆత్మానుభవమును పొందాడో వాడికి శాంతిస్వరూపముగానే వ్యక్తమవుతుంది. దైవానుగ్రహం తప్పించి మిగిలినవన్నీ తలంపులే. విషయాన్ని చాలా simpleగా చెప్పటంకోసం భగవాన్ ఈ భూమిమీదకు వచ్చారు. మనం దానిని complicate చేసుకొంటున్నాము గాని నిజం అనేది simpleగానే ఉంటుంది. మన మనస్సు complicateగా ఉంటుంది కాబట్టి నిజంకూడా complicateగా ఉంటుంది అనుకొంటున్నాము. నిజం అనేది complicateగా ఉండదు.

ఆత్మ స్థితినే తురీయస్థితి అంటారు. అది సహజస్థితి. తురీయస్థితి 32 రకాలుగా ఉంటుంది అని ఒకరు వ్రాసారు అని భగవాన్‌తో అంటే తెలివిచేసే గాబరా అలా ఉంటుంది అన్నారు భగవాన్. అది 32 రకాలుగా లేదు, ఒకటిగానే ఉంది. ఇది అంతా human brain చేసే గాబరా అన్నారు. సత్యం అనేది simpleగా ఉంటుంది, normalగా ఉంటుంది. దీనిగురించి చెప్పటానికి పెద్ద తెలివి అవసరములేదు. అసత్యముగురించి చెప్పటానికే ఎక్కువ తెలివి అవసరము. నీవు అది ఏదో కష్టం అనుకొని దానిని complicate చేసుకొంటున్నావు. ఇది అంతా మనస్సే కల్పిస్తోంది. మాయ అంతా మనస్సులోనే ఉంది.

మనస్సు పుడితే అన్నీ పుడతాయి. మనస్సు అణిగిపోతే అన్నీ అణిగిపోతాయి. చావటం, తిరిగిపుట్టటం ఇవి అన్నీ నిజంకాదు. ఇవి అన్నీ తలంపులుమాత్రమే. నీవు ఆత్మలోనికి మేలుకోవటమే నిజమైన పునర్జన్మ. నీకు ఆత్మానుభవం కలగటమే నిజమైన పునర్జన్మ. అదిమాత్రం తలంపుకాదు. మీకు ఆత్మానుభవం కలగజేయటంకోసం, ఉన్నది ఉన్నట్లుగా సామాన్యమానవునికి తెలియజేయటంకోసమే రమణమహర్షి ఈ భూమిమీదకు రావటం జరిగింది. సత్యమును ఉన్నది ఉన్నట్లుగా receive చేసుకోవటానికి human brain ఇష్టపడదు. Human brainలోనే ఆతేడా ఉంది. మనస్సుకు ఎంతసేపు అక్కరలేని గొడవలు కావాలి. గొడవలన్నీ మనస్సే సృష్టిస్తుంది. అది సృష్టించిన గొడవలలోనికి అది ఆకర్షించబడుతూ ఉంటుంది.

సత్యం అనేది మన మనస్సుతో పట్టుకొనేది కాదు, మన తెలివితో పట్టుకొనేదికాదు. మనస్సు ఎక్కడయితే అణిగిపోయిందో అక్కడ సత్యం నీకు వ్యక్తమవుతుంది. అంతేగాని మనస్సు వెళ్ళి దానిని పట్టుకోదు. మనస్సు అణిగినచోట సత్యం ఉంది. అది దేశకాలములచేత బంధింపబడేది కాదు. ఇప్పుడు మనస్సు నీకు ఏవిధంగా అయితే నేనుగా వ్యక్తమవుతోందో మనస్సు అణిగినచోట సత్యం నీకు నేనుగా వ్యక్తమవుతుంది. సత్యము ఎప్పుడైతే నీకు నేనుగా వ్యక్తమయిందో అప్పుడు నీవు దుఃఖములోనుండి విడుదలపొందుతావు. నీవు చేసిన సాధనలు, నీవు పడిన కష్టాలు కూడా నిజంకాదు అని అప్పుడు నీకు తెలుస్తుంది. గత జన్మలుకూడా స్వప్నమాత్రం అని నీకు తెలుస్తుంది.

జ్ఞానము, అజ్ఞానము గురించి భగవాన్ చాలా అందంగా చెప్పారు. అజ్ఞానము అనేది నిజంగా లేదు. నీవు ఎవరో నీకు తెలియకపోవటమే అజ్ఞానము. అజ్ఞానము నిజంగా ఉంటే అదిపోదు. నీవు ఎవరో నీకు

తెలియకపోవటమే అజ్ఞానము, అది తెలిస్తే జ్ఞానము అంతే. అంతకంటే ఏమీలేదు. ఎంత simpleగా ఉందో చూడండి. దీనిని గాబర చేసుకొని అజ్ఞానము ఉంది అని భావన చేసుకొని దానిని తొలగించుకోవటం కష్టం అని ఇలా కల్పించుకొంటున్నాము. అన్నమయకోశము, మనోమయకోశము, ప్రాణమయకోశము అని ఇలా అక్కరలేని గొడవలు కల్పించుకొంటున్నాము. ఇవి అన్నీ మనస్సు కల్పించిన గొడవలు. ఇల్లు తుడిచిన తరువాత దుమ్మును పెంటమీద పారవేయటం మానివేసి అందులో ఏమి ఉన్నాయి అని లెక్కపెట్టుకోవటం ఎటువంటిదో మనస్సు కల్పించిన గొడవలలో ఉండటంకూడా అటువంటిదే. పెంటమీద పారవేసే వస్తువుగురించి లెక్కలు పెట్టుకోవటంవలన నీకు కాలము, శక్తి వృధా అవుతుంది. మనస్సు కల్పించిన గొడవలలో ఉండటంవలన నీకు ప్రయోజనం ఏమీలేదు. కల్పించుకొన్న గొడవల వలననే మనకు దుఃఖం వస్తుంది. మనం trainకు వెళ్ళాలి అనుకోండి అది ఏ టైముకు వస్తుంది అని తెలుసుకోవాలి. అది Mechanical knowledge. దీనివలన మనకు దుఃఖం రాదు. అది lateగా వస్తుందేమో అది పడిపోతుందేమో, మనం సరిగా గమ్యం చేరతామో, లేదో అని ముందుగా గొడవపెట్టుసుకొంటాము. దీనివలన దుఃఖము వస్తుంది. Mechanical knowledgeవలన మనకు దుఃఖం రాదు. కల్పించుకొన్న గొడవలవలననే దుఃఖం వస్తుంది. గందరగోళం అంతా మనస్సులోనే ఉంది. మనస్సును తీసి ఒకప్రక్కన పెడితే ఏమీలేదు.

ఏ సత్యంకోసం అయితే నీవు ప్రయత్నం చేస్తున్నావో అది ఎవరోకాదు, అది నీవే. ఏ సత్యాన్ని అన్వేషణ చేసే ప్రయత్నంలో మనం ఉన్నామో దాని అనుగ్రహం లేకుండా దానిని మనం పొందలేము. అనుగ్రహంమాత్రం తలంపు కాదు. అది తలంపులకు అతీతమైనది. అయితే దాని అనుగ్రహం ఎప్పుడు మనకు కలుగుతుంది? అది ఒక్కటిమాత్రమే కావాలనుకొన్నవారిని అది అనుగ్రహిస్తుంది. కాని మనకు అదీ కావాలి అన్నీ కావాలి.

తెలివితక్కువవారికి అహంకారం ఉంటుంది, తెలివైనవారికి అహంకారము ఉంటుంది. తెలివి తక్కువవారి అహంకారము బయటకు కనబడుతూ ఉంటుంది. తెలివైనవారు వారి అహంకారము పైకి కనబడకుండా చూసుకొంటారు. అహంకారము పైకి కనబడకుండా చూసుకోవటానికి వారి తెలివి ఉపయోగపడుతుంది గాని అహంకారమును చంపటానికి వారి తెలివి ఉపయోగపడదు.

స్మశానంలో దేహమును burn చేసినపుడు దేహగతమైన చరిత్ర పూర్తి అవుతుంది గాని నేనుయొక్క చరిత్ర పూర్తికాదు. ఈ నేను దేహము లేకుండా ఉండలేదు. అందువలన శరీరంకోసం ఒకతల్లి కడుపులో ప్రవేశిస్తుంది. అప్పుడు దానికి ఒక దేహము వస్తుంది. అది ఆ దేహముతో తాదాప్యము పొందుతుంది. దేహమే తాను అనుకొంటుంది. దేహం చనిపోయినపుడు తాను చనిపోతున్నాను అనుకొంటుంది. శవాలను మోయటమే దాని పని. తల్లికడుపులోనుండి బయటకు వచ్చినపుడు ఎన్ని వాసనలతో ఉన్నామో ఈ శరీరం స్మశానమునకు వెళ్ళేటప్పటికి అందులో కొన్ని వాసనలను అయినా తగ్గించుకోవాలి. కాని మనం తల్లి కడుపులోనుండి 10 వాసనలతో బయటకు వస్తే స్మశానమునకు వెళ్ళేటప్పటికీ ఇంకో 10 వాసనలు కలుపుకొంటున్నాము. అంటే మనస్సుకు కొత్తవాసనలు కలుపుకొంటున్నాము. దానినిబట్టి జన్మలు పెరుగుతున్నాయి. సాధనయొక్క ప్రయోజనం ఏమిటి అంటే తల్లి కడుపులోనుండి 10వాసనలతో బయటకు వస్తే స్మశానమునకు వెళ్ళేసరికి మనం కనీసం 5 వాసనలను అయినా తగ్గించుకోవాలి. మొత్తం అన్నీ తగ్గించుకొంటే మంచిదే. కాని మనం ఏమి చేస్తున్నాము అంటే 10 వాసనలతో తల్లి కడుపులోనుండి బయటకు వస్తే మరణించే టైముకు ఇంకో 10 వాసనలు కలుపుకొని 20 వాసనలతో స్మశానమునకు వెళుతున్నాము. అంటే మనస్సుకు వాసనలు పెంచుతున్నావు. అందువలన జననమరణ ప్రవాహము అలాగ continue అవుతోంది.

నేను ఎవడను? అనే ప్రశ్న మనో నిగ్రహానికి సహకరిస్తుంది. మనకు మనస్సే నేనుగా వ్యక్తమవుతోంది. ఆ నేనును నీవు ఎవరు అని ప్రశ్నించటంవలన మనస్సు నిగ్రహించబడుతుంది. ఏదైతే మనకు నేనుగా

వ్యక్తమవుతోందో దానిని who is this I? అని ప్రశ్నించటం. Who am I? అని అనుకోవటంకంటే who is this I? అని అనుకోవటంవలన అది ఇంకా బాగా మనకు అవగాహన అవుతుంది. ఏదైతే మనకు నేనుగా వ్యక్తమవుతోందో దానిని నీవు ఎవరు అని ప్రశ్నించటంవలన అది అంతర్ముఖమవుతుంది.

నీకు దేహం ఉండవచ్చు, డబ్బు ఉండవచ్చు, గౌరవము ఉండవచ్చు. అవి నీకు ఉంటే ఉండవచ్చు. అవి ఏమీ నీవు కాదు. నీవు కానిదానితో తాదాప్యం పొందుతున్నావు. అజ్ఞానము పెరిగిపోతోంది. జీవుడికి దేహాలు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. ధనం, గౌరవం వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. తలంపులు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. వస్తూ పోతూ ఉండేవి ఏమీ నీవు కాదు. వీటి అన్నింటికి అతీతంగా ఉన్న వస్తువు, సిరంగా ఉన్న వస్తువు ఒకటి నీ హృదయంలో ఉంది. అది దేహం లేకుండా, లోకం లేకుండా, దేవుడు లేకుండా, దేనితోనూ సంబంధం లేకుండా స్వతంత్రముగా ఉండగలదు. దాని స్వరూపమే సుఖం. బాహ్యామైన వ్యక్తులమీదగాని, బాహ్యామైన వస్తువులమీదగాని సుఖంకోసం ఆధారపడవలసిన పని దానికి లేదు. ఆ సుఖం నీవు ఎంత అనుభవించినా తరగదు. దేహానికి పుట్టుక ఉంది, ఆత్మకు పుట్టుక లేదు. నీవు ఆత్మానుభవంను పొందినపుడు పుట్టుకలేని సుఖాన్ని పొందుతావు. ఆత్మసుఖాన్ని పొందుతావు. అది పూర్ణసుఖము ఇంక వెలితి ఉండదు. ఆ సుఖం నీకు అనుభవంలోనికి వచ్చినపుడు దేవుడు వచ్చి ఎదురుగా నిలబడినా నీకు చూడాలని అనిపించదు. అంటే ఇష్టంలేక కాదు అవసరం లేదు కాబట్టి.

మనస్సును నిగ్రహించుకోవటానికి భగవాన్ రెండు మార్గములు చెప్పారు. మనస్సును నీవు ఎవరు అని ప్రశ్నించటం. అంటే మనస్సు అంటే ఏమిటి అని విచారణ చేయటం. ఎన్నో జన్మలనుండి నాకూడా వస్తున్నావు. నా అశాంతికి నీవే కారణం కదా నీవు ఏమిటి అని మనస్సును ప్రశ్నించటం. దానిని ఎప్పుడైతే ప్రశ్నిస్తున్నావో అది అణగటం ప్రారంభిస్తుంది. అణిగిన మనస్సుకుగాని ఆత్మానుభవం కలుగదు. ఏక వస్తువును చింతించటంవలనకూడా మనస్సు నశిస్తుంది. పూజ, జపంకూడా మనో నిగ్రహానికి సహకరిస్తాయి. జీవ లక్షణాలు లేనివాడికి శరీరం ఉన్నా ఒకటే, శరీరం లేకపోయినా ఒకటే. ప్రపంచం కనబడినా ఒకటే, ప్రపంచం కనబడకపోయినా ఒకటే. జీవలక్షణాలు ఉన్నవాడికి పునర్జన్మ వస్తుంది. వాడికి పునర్జన్మ ఎందుకు వస్తుంది అంటే జీవలక్షణాలు దేహం లేకుండా వ్యక్తం కావటానికి అవకాశము లేదు.

నీవు ఏ వస్తువుకోసం అయితే వెతుకుచున్నావో అది నువ్వే. సత్యం నీవే. నీవే బ్రహ్మం. ఇప్పుడు దేహంతో ఎలా తాదాప్యం పొందుతున్నావో అలాగ బ్రహ్మంతో తాదాప్యం పొందటం ప్రారంభిస్తే మనస్సు అణిగిపోతుంది. బ్రహ్మనుభవం పొందినవాడికి నిగ్రహించుకోవటానికి ఒక మనస్సు అంటూ ఉండదు. రోగం ఉందో లేదో మందు చూసుకో. రోగం ఉంటే మందు వాడవచ్చు. అలాగే మనస్సు ఉందోలేదో ముందు చూసుకో. మనస్సు ఉంటే నిగ్రహించుకోవచ్చును. లేకపోతే ఏ గొడవ లేదు.

నీకు ఇష్టమైన రూపమును తీసుకొని నిరంతరము చింతించటంవలన నిరంతరము ఆ రూపముమీద ధ్యాస పెట్టుకోవటంవలన కూడా మనస్సు నశిస్తుంది. మనస్సుచేతే ధ్యానం చేయించి మనస్సును చంపటం. మనస్సు ధ్యానం చేయగా చేయగా దానికి పవిత్రత వస్తుంది. పవిత్రత ఎప్పుడైతే వచ్చిందో అప్పుడు నీకు realization వచ్చేస్తుంది. చేతిలో ఉన్న ముద్దను నోటిలో పెట్టుకోవటం ఎంత తేలికో నీకు pure mind వస్తే బ్రహ్మనుభవం పొందటం అంత తేలిక . సత్పురుషుల సహవాసము, సద్గ్రంధ పఠనము pure mind కోసమే.

మాకు ప్రాపంచిక గొడవలు ఎక్కువగా ఉంటాయి. రకరకాల ఇబ్బందులు ఉంటాయి. దేవుని ప్రార్థిస్తున్నాము. మాకు తగిన సంతృప్తి కలగటం లేదు. ఆధ్యాత్మిక పురోగతిని పొందలేకపోతున్నాము. మేము ఇప్పుడు చేయవలసింది ఏమిటి అని అడుగుతున్నారు. భగవాన్ చిన్న మాట అన్నారు. Trust God అన్నారు. నీవు భగవంతుని నమ్మితే అన్నీ అవే చక్కబుచ్చుకొంటాయి. భగవంతుని విశ్వసించు, బరువు ఆయనమీద

వెయ్యి. అన్నీ ఆయనే చూసుకొంటాడు.

జరిగేది అంతా ఈశ్వరసంకల్పము ప్రకారము జరుగుతుంది. అనుకొనేది మన సంకల్పము. మన సంకల్పము ఆయన సంకల్పము కలిసినపుడు ఆపని జరుగుతుంది. అప్పుడు నావలననే జరిగింది అని మనం అనుకొంటాము. మన సంకల్పము, ఆయన సంకల్పము కలవనపుడు ఆయన సంకల్పమే జరుగుతుంది గాని మన సంకల్పము జరగదు. మనం తల్లి కడుపులో ఉండగానే ఈ శరీరమునకు సంబంధించిన సినిమా తీసివేసి ఈ భూమిమీదకు పంపిస్తారు. ఏ క్షణంలో ఎక్కడ ఉండాలి, ఏపని చెయ్యాలి, ఎప్పుడు మరణించాలి అనేవి నిర్ణయించి ఈ దేహమును భూమిమీదకు పంపిస్తారు. ఈ బొమ్మలు అన్నీ ఆడేసి మరల ఏదో రోజు మరుగైపోతాయి. దేహముద్వారా జరిగే ప్రతీ చిన్న సంఘటనకూడా తల్లి కడుపులో ఉండగానే నిర్ణయించబడుతుంది. ప్రతి చిన్న విషయంకూడా దేవుని సంకల్పము ప్రకారము జరుగుతుంది. ప్రతీది భగవంతుని నిర్ణయం ప్రకారము జరుగుతూ ఉంటే మేము చేసే పూజలు, జపాలు, యజ్ఞాలు ఎందుకు అని అడిగారు. ఇవి అన్నీ ఎందుకు చేయాలి అంటే నీవు దేహంతో తాదాప్యం పొందకుండా ఉండటంకోసం. నీ సాధనలు అన్నీ దేహముతో తాదాప్యం పొందకుండా ఉండటంకోసమే. దేహముతోకనుక తాదాప్యం పొందకుండా ఉంటే దుఃఖం నిన్ను ముట్టుకోదు. అప్పుడు **immortal state**ను పొందుతావు.

భగవాన్ అరుణాచలం వచ్చినరోజున గోచీ పెట్టుకొన్నారు. 54 సంవత్సరాలు అక్కడ ఉన్నారు. ఆశ్రమంలో ధనం కురిసింది. ప్రపంచం అంతా అక్కడకు వచ్చింది. ఆ గోచీతోనే ఉన్నారు ఎక్కడా వికారము లేదు. అరుణాచలం వచ్చిన రోజున ఎలాగ ఉన్నారో చివర రోజునకూడా అలాగే ఉన్నారు. ఎందుచేతనంటే అక్కడ మనస్సు లేదు. నీవు దేహముతో తాదాప్యం పొందటం ఎప్పుడైతే మానివేసావో అప్పుడు మనస్సు పలచబడుతుంది. అప్పుడు **ego** చిరిగిపోతుంది. **Ego** ఎప్పుడైతే చిరిగిపోయిందో నీ స్వరూపం నీకు నేనుగా వ్యక్తమవుతుంది.

**Trust God** అని భగవాన్ చెపుతున్నారు. మేము భగవంతుని నమ్ముతున్నాము, భగవంతుని విశ్వసిస్తున్నాము అయినప్పటికీ మాకు ఇంకా సహాయం అందటంలేదు అని అడుగుతున్నారు. అప్పుడు భగవాన్ ఏమంటున్నారు అంటే భగవంతునికి శరణాగతి పొందిన మాట నిజమైతే భగవంతుని దగ్గరనుండి మాకు సహాయం అందటంలేదు అన్నమాట నీ నోటినుండి రాదు అన్నారు. నాకు భగవంతుడు సహాయం చేయటం లేదు అన్నవాడినిమటుకు ఈయన భగవంతుడికి **Surrender** చేయలేదు. **Personal I**నుమటుకు ఈయనదగ్గరే పెట్టుకొన్నాడు. **Personal I**ను ఇందులో **involve** చేయమని భగవాన్ చెపుతున్నారు. ఎందుచేతనంటే నేరస్తుడు వాడే. దేవుడిని నమ్ముతున్నాము. దేవుడిదగ్గరనుండి సహాయం రావటం లేదు అంటున్నారు. దేవుడి దగ్గరనుండి సహాయం రావటంలేదు అని ఎవడైతే అంటున్నాడో వాడిని కనుక **surrender** చేస్తే దేవుడిమీద ఈ **complaint** పెట్టవు. దేవునికి శరణాగతి చెందినమాట నిజమైతే దేవుని సంకల్పమునకు భిన్నంగా నీవు మాట్లాడవు. దేవుని సంకల్పమునందు నీకు గౌరవము కలుగుతుంది. దేవునికి ఎవడైతే పూర్ణశరణాగతి పొందాడో దేవుని సంకల్పమేవాడి సంకల్పము, దేవుని భావనే వాడి భావన అవుతుంది. వాడి సంకల్పము దేవుని సంకల్పమునకు భిన్నంగా ఉండదు.

ఏది మంచి, ఏది చెడ్డ అనేది మనకు తెలియదు. ఏదో చెడ్డవచ్చి మనమీదపడిపోయింది అనుకొంటాము. నీ హృదయంయొక్క లోతులలోనికి నీ మనస్సును ముంచివేయటానికి ఆ చెడ్డ ఉపయోగపడవచ్చును. బాహ్యంగా జరిగే ఒకో సంఘటనవలన నీ మనస్సు అంతర్ముఖం అవ్వవచ్చు. మిమ్మలను బాగా ప్రేమించేవారు మీకు దూరం అవుతున్నారు అనుకోండి. అప్పుడు మీ మనస్సు ఈశ్వరునియందు నిలబడవచ్చు. నీ మనస్సుకు ఎవరైతే ఆధారముగా ఉన్నారో వారు మీకు దూరం అవుతారు అనుకోండి. అప్పుడు మీ మనస్సుయొక్క బోట్లుక్రిందపడిపోతాయి. మీ మనస్సుయొక్క బోట్లు ఎప్పుడైతే క్రిందపడిపోయాయో అది

హృదయంయొక్క లోయలలోనికి కూరుకుపోతుంది. మనం బోట్లు పెట్టుకొని బ్రతుకుచున్నాము. గర్వం ఒక బోటు, ఆస్తి ఒక బోటు, స్నేహాలు ఒక బోటు. ఈ బోట్లమీద ఆధారపడి నీ మనస్సు నిలబడుతుంది. భగవంతుడు ఏమి చేస్తాడు అంటే బాహ్యమైన సంఘటనలను సృష్టించి ఒకో బోటును ఊడగొడతాడు. అప్పుడు మనకు భయం వేస్తుంది. ఆధారములు ఊడగొడుతున్నాడు ఏమిటి అని బాహ్యముగా మీరు అనుకోవచ్చును. కాని ఆధారములను ఊడగొట్టటంద్వారా నీ మనస్సును కృంగదీసి అది హృదయంలో నిలబడి ఉండేటట్లు చేస్తాడు. మనస్సు హృదయంలో ఎక్కువగా ఉండటంవలన మనస్సు హృదయంలో కరిగిపోతుంది. మనస్సు హృదయంలో కరిగిపోతే false I నశిస్తుంది, true I నీకు తెలుస్తుంది.

భగవంతుడు కృష్ణుడు నన్ను తెలుసుకో అన్నాడు known me అన్నాడు చూడండి ఆ me ఎక్కడ ఉంది. నీ హృదయంలోనే ఉంది. False I ఎప్పుడైతే eliminate చేయబడిందో లోపల ఉన్నవస్తువు మీకు వ్యక్తమవుతుంది. బాహ్యముగా జరిగే సంఘటనలు ఒకోసారి మంచిగా జరగవచ్చు. అవి భవిష్యత్‌లో మీ పతనానికి కారణం అవ్వవచ్చు. కొన్ని కొన్ని సంఘటనలు మీకు చెడ్డగా కనబడవచ్చు. ఆ చెడ్డ సంఘటనలు భవిష్యత్‌లో మీరు బాగుపడటానికి ఉపయోగపడవచ్చును. ఏది మంచి, ఏది చెడ్డ అనేది మీకు తెలియదు. జీవితాన్ని భగవంతుడు ఏ విధంగా మలుపు త్రిప్పుతాడో అనేది మీరు చెప్పలేరు.

ఈ శరీరము రాకముందు ఎక్కడ ఉన్నామో మనకు తెలియదు. ఈ శరీరం మరణించాక ఎక్కడికి వెళతామో మనకు తెలియదు. కాని మనం చెప్పినట్లు దేవుడు వినాలి అని అనుకొంటాము. శరణాగతిపొందినవాడు నేను చెప్పినట్లు దేవుడు వినాలి అని అనుకోడు. దేవుడి ఇష్టమే నా ఇష్టం, దేవుని సంకల్పమే నా సంకల్పము అనుకొంటాడు. అది శరణాగతి లక్షణము. ఈ రోజు నేను విష్ణుసహస్రనామములు చదివాను. దేవుడు నాకు ఇంకా reply ఏమీ ఇవ్వలేదు, నన్ను ఏమి బాగుచేయలేదు అని శరణాగతిపొందినవాడు చెప్పడు. శరణాగతే నిజమైన ప్రార్థన. భగవంతుని సంకల్పమునకు మనలను మనం అర్పించుకోవటం మంచిది. దానివలన దేహబుద్ధి నశిస్తుంది.

మీ దుఃఖానికి కారణము ఏమిటి అంటే అందరూ తలో ఒకరకం కారణం చెపుతారు. అత్తగారు కారణం అని కొందరు, భర్త కారణం అని కొందరు, రోగం కారణం అని కొందరు చెపుతారు. కృష్ణుడు గీతలో ఏమని చెప్పాడు అంటే మీరు ఏ కారణం అయితే చెపుతున్నారో అది నిజంకాదు అని చెప్పాడు. మీ దుఃఖానికి అజ్ఞానము కారణము అని చెప్పాడు. అందువలన అజ్ఞానము నశిస్తే దుఃఖము నశిస్తుంది. ఈ కారణములు అన్నీ ఎందుకు నిజంలాగ కనిపిస్తున్నాయి అంటే అజ్ఞానమువలన. అజ్ఞానము లేకపోతే కారణములు ఉన్నప్పటికీ దుఃఖము రాదు. దేహప్రారబ్ధములో దుఃఖము అనుభవించవలసి ఉంటే ఏదో రూపంలో అది వస్తుంది. అత్తగారువలన రావచ్చును, భర్తవలన రావచ్చును, పిల్లలవలన రావచ్చును. అక్కడ మనిషి ముఖ్యంకాదు. మీ ప్రారబ్ధములో అది ఉంటే ఏదో రూపంలో వస్తుంది. మీకు దేహబుద్ధి ఎప్పుడైతే నశించిందో దుఃఖము మిమ్మలను ఏమీ చేయలేదు.

అహంకారమును తొలగించుకోవటానికి గురువు అనుగ్రహము ఉండాలికదా అని అడుగుతున్నారు. అహంకారమును తొలగించుకోవటానికి శ్రవణం, మననం, జపంచేసుకోవటం ఇవి అన్నీ అవసరమే. మీరుచేసే ప్రయత్నాలు అన్నీ అవసరమే. కాని వీటి అన్నింటికంటే గురువు అనుగ్రహం అత్యంత ముఖ్యమైనది. మీరు పూజలు, జపాలు, ధ్యానాలు చేయవచ్చు. ఇవి అన్నీ secondary, గురువు అనుగ్రహం అత్యంత బలీయమైనది. గురువు అనుగ్రహంలో పడినవాడు రక్షింపబడతాడుగాని వాడు తిరిగి ప్రకృతిలోనికి వచ్చే అవకాశము లేనేలేదు. గురువు అనేవాడు సద్వస్తువుకంటే వేరుగా లేడు. గురువు వేరు, ఆత్మవేరు, దేవుడు వేరు కాదు. గురువు అన్నా, దేవుడు అన్నా, ఆత్మ అన్నా ఒక్కటే.

గురువుయొక్క అనుగ్రహం నాకు కలుగుతుందా అని అడుగుతున్నాడు. గురువు అనుగ్రహం కలగకపోవటం

ఏమిటి ఎప్పుడూ ఉన్నది అదే అంటున్నారు భగవాన్. గురువు ఎప్పుడూ అనుగ్రహిస్తూనే ఉంటాడు. అక్కడ అందుకొనే station properగా లేనపుడు అది తెలియదు. మన రేడియో పోయింది అనుకోండి. అది పలకకపోతే విజయవాడలో station పోయింది అనుకోకూడదు. అదేవిధంగా దేవుని అనుగ్రహం ఎప్పుడూ ఉంది. దానిని అందుకొనే స్థాయి మనకు లేనపుడు మనం దానిని అందుకోలేము. అదే భగవాన్ చెపుతూ ఉంటారు కొంతమంది కళ్ళుఉండి చూడలేరు, చెవులు ఉండి వినలేరు. మీకు అర్హత లేనపుడు, యోగ్యత లేనపుడు అత్యంత సమీపంలో వస్తువు ఉన్నప్పటికీ అదిమీకు అందదు. తగిన పవిత్రత అక్కడ లేకపోతే వస్తువు ఎదురుగా ఉన్నప్పటికీ గ్రహించేశక్తి వారికి ఉండదు. అర్ధంచేసుకోవటంకూడా ఒకయోగం అని భగవాన్ చెప్పారు. Subjectను ఉన్నది ఉన్నట్లుగా Properగా అర్ధంచేసుకోవటంకూడా ఒకయోగమే. పూజచేయాలంటే చాలా కష్టపడాలి. పూవులు కోయాలి, దేవుని పఠందగ్గర పెట్టాలి. అక్కడ అంతా శుభ్రం చేయాలి. ఇది అంతా పెద్దపని. కాని Subject properగా అర్ధమయితే మీకాలు కదపకుండా చేతులు కదపకుండా, తల త్రిప్పకుండా మీకు వస్తువు అనుభవంలోనికి వేస్తుంది. పూజకంటే తేలిక. ఎవరికి తేలిక గ్రహించినవారికా, గ్రహించనివారికా అని ఒకరు భగవాన్‌ను అడిగితే గ్రహించినవారికే తేలిక అన్నారు భగవాన్.

అనుగ్రహం ఎప్పుడూ ఉంది. అనుగ్రహం ఉందా, లేదా అని నీవు అనుమానించనక్కరలేదు. అనుగ్రహం ఉంది అని ఎప్పుడు నీకు తెలుస్తుంది అంటే శరణాగతివలన తెలుస్తుంది. చెరువులో పీకిలోతు నీటిలోఉండి నాకు దాహం వేస్తోంది నీరు దొరకటంలేదు అనుకొనేవాడు ఎటువంటివాడో దేవుని అనుగ్రహం మధ్యలోనే ఉండి నాకు దేవుని అనుగ్రహం దొరకటంలేదు అనుకొనేవాడు కూడా అటువంటివాడే. నా మనస్సును, హృదయాన్ని దేవునికి ఇచ్చివేసాను. ఇవిరెండూ ఇచ్చివేసినా నాకు దేవుని అనుగ్రహం అందటంలేదు అంటున్నారు. దేవుడికి నీ మనస్సును ఇచ్చిన మాట నిజమైతే దేవుని అనుగ్రహం నాకు రావటంలేదు అనే ప్రశ్నరానే రాదు అంటున్నారు భగవాన్. నీవు ఇవ్వలేదు కాబట్టి వస్తోంది. దేవుని అనుగ్రహం రావటంలేదు అని చెప్పేది మనస్సే. మనస్సును ఇచ్చివేస్తే మనస్సు ఎందుకు complaint చేస్తుంది. మనస్సును ఇవ్వలేదుకాబట్టి అక్కడ మనస్సు ఉందికాబట్టి అది complaint చేస్తోంది. complaint చేసేవాడు శరణాగతి చెందినవాడిక్రింద లెక్కకాదు. శరణాగతి ఎలా ఉంటుంది అంటే నాచేతిలో Pillow ఉంది అనుకోండి. దానిని ఎక్కడ పెట్టినా అది ఏమీ అనదు. మంచంమీద పెట్టినా, క్రింద పారేసినా అది ఏమీ అనదు. pillow నా చేతిలో పనిముట్టులాగ ఎలా ఉందో అలాగ శరణాగతి పొందినవాడు దేవుని చేతిలో పనిముట్టులాగ ఉంటాడు. దేవుడు ఎలా వాడుకోవాలంటే అలావాడుకొంటాడు. అక్కడ complaint అనేది అసలు ఉండదు.

మనకీ భక్తి ఉంది. రమణమహర్షిగారికీ భక్తి ఉంది. మన భక్తికి ఆయన భక్తికి ఒకతేడా ఉంది. దేవుడు మనకంటే వేరుగా ఉన్నాడు అనుకొంటున్నాము. ఆయనపై మనకు భక్తి ఉంది. దేవుడు ఆయనకంటే వేరుగా లేడు అని తెలిసికూడా రమణమహర్షిగారికి భక్తి ఉంది. అందువలన మన భక్తి కంటే ఆయన భక్తి ఉదాత్తమైనది. నువ్వే దేవుడు, నీ హృదయంలోనే దేవుడు ఉన్నాడు అని చెపితే ఎవరికీ రుచిగా ఉండదు. ఆముదం పుచ్చుకొన్నట్లుగా ఉంటుంది. దేవుడు మీకు వేరుగా ఉన్నాడు అంటే వినటానికి అందరూ ఇష్టపడతారు. ఎందుచేతనంటే ఏదైనా అడగటానికి బాగుంటుంది అని. దేవుడు వేరుగా ఉన్నాడు అంటేనే అందరూ ఇష్టపడతారు. వేరుగా ఉంటే పూజలు చేయవచ్చు, వరాలు అడగవచ్చు. ఆ వరాలు ఆయన ఇస్తాడు అప్పుడు వాటిని అనుభవించవచ్చు అనే దృష్టితో దేవుడు వేరుగా ఉన్నాడు అంటేనే ఇష్టపడతారు. ఈరకమైన ప్రసంగాలు చెపితేనే జనం ఎక్కువ ఇష్టపడతారు. మనహృదయంలో ఉన్న దేవునికంటె గుడిలో ఉన్నదేవుడు అంటే మనకు ఇష్టం. మన మనస్సు ఎంత నిజమో గుడిలో ఉన్న దేవుడుకూడా అంతే నిజం. మనస్సు అసత్యాన్ని నమ్ముతుందిగాని సత్యాన్ని నమ్మదు. ఎందుచేతనంటే మనస్సుకూడా అసత్యం

కా౯ట్టి. అసత్యమైన దేవుని నమ్మమంటే నమ్ముతుందిగాని సత్యమైన దేవుడిని నమ్మమంటే అది నమ్మదు. ఎందుచేతనంటే సత్యమైన దేవుని నమ్మితే దాని ఉనికే పోతుంది, దాని అస్తిత్వమే పోతుంది అందువలన అది నమ్మదు.

దేవుడు వేరు, దేవుడు మాట వేరు కాదు. దేవునిమాటను తీసుకొని అంటే ఆశబ్దాన్ని మనం follow అవుతూ ఉంటే మనం దేవుని అనుగ్రహంలో ఉన్నట్లే. దేవుని అనుగ్రహం లేకుండా దేవునిమాటకూడా మనకు అర్ధంకాదు. భగవంతుడు చెప్పిన మాటలు మనకు కొద్దిగా అందుతున్నాయి అనుకోండి అది మన తెలివితేటలవలన కాదు. ఆయన అనుగ్రహంవలననే అందుతున్నాయి అనుకోవాలి. మన జీవితంలో తెలివి అవసరమే గాని తెలివి సర్వస్వం కాదు. ఒక్క తెలివివలననే నీకు బ్రహ్మానుభవం కలుగదు. తెలివి అవసరమేగాని వాడు తెలివికాదు. వాడు ఆత్మే.

భగవంతుడు ఏ అవకాశములు అయితే మనకు ఇచ్చాడో వాటిని properగా ఉపయోగించుకొంటే మనకు higher [redacted] birth ఇస్తాడు. వాటిని మనం properగా ఉపయోగించుకోకపోతే మరల lower birthకు వెళ్ళిపోతాము. భక్తులుకూడా చాలమంది higher birthనే కోరుకొంటారు. మోక్షాన్ని కోరుకోరు. దేహంలేని స్తితి వాడికి అందటంలేదు. మరల జన్మ వస్తే దేహం వస్తుంది. దేహంతో enjoy చేయవచ్చు అనుకొంటాడు. దేహంలేని స్థితి ఒకటి ఉంది అని ఈ భక్తుడికి తెలియటంలేదు. Subject శ్రవణం చేయడు. శ్రవణం చేస్తేగాని తెలియదు. శ్రవణంచేసినా అర్ధంచేసుకోవటం కష్టం. శ్రవణం చేయనివాడికి తెలియనే తెలియదు. మనిషి మోక్షాన్ని ఎందుకు కోరుకోవటంలేదు అంటే దాని విలువ వాడికి తెలియటంలేదు. దాని విలువ తెలియక దానిని కోరుకోవటంలేదు. మంచి birth రావాలి అని కోరుకొంటాడు. Birth అంటే శరీరం వస్తుంది. ఆ శరీరం ఎంతకాలం ఉంటుంది. కొంతకాలం ఉంటుంది తరువాత పడిపోతుంది. శరీరం వచ్చింది అనుకోండి రోగం వస్తుంది, ముసలితనం వస్తుంది, మరణం వస్తుంది. ఇందులో ఉన్న దోషములే నీకు తెలియటంలేదు. ఆ దోషములు నీకు తెలియకపోవటంవలన rebirthను కోరుకొంటున్నాము.

నీ హృదయంలో ఒక నిజం ఉంది. ఇప్పుడు దేహం ఏ విధంగా అయితే నీకు అనుభవంలో ఉందో ఆ నిజాన్ని నీవు అనుభవంలోనికి తెచ్చుకోవటమే జ్ఞానం. పసుపు, కుంకుమ, విభూతి తెప్పించటం జ్ఞానం కాదు. నీ దేహం మరణించినా నీ హృదయంలో ఉన్న నిజానికి మరణం లేదు. ఇప్పుడు నీకు దేహము నేనుగా ఎలా వ్యక్తమవుతోందో అలాగ హృదయంలో ఉన్న నిజం నీకు నేనుగా వ్యక్తమవ్వాలి. అది జ్ఞానము. నీవు అన్నీ తెలుసుకొంటున్నావు. అన్నీ తెలుసుకొనే ఆనేను ఎవడో నీకు తెలియదు. అది తెలియకుండా నీవు ఎన్ని తెలుసుకొన్నా నీవు అజ్ఞానివే. అన్నీ తెలుసుకొనే ఈ నేను ఎవడో మనకు తెలియటంలేదు. ఆ నేను ఎమి చెపుతోంది అంటే నీవు అన్నీ తెలుసుకో నాజోలికిమటుకు రాకు అని చెపుతుంది. దానిని బోను ఎక్కిస్తే దానిని విచారణ చేస్తే దాని మరణానికి అది దారి తీస్తుంది. దాని మరణానికి అది ఇష్టపడదుకదా అందువలన దానిని విచారణ చేయటానికి అది అంగీకరించదు.

మన భక్తి ఎటువంటిదో భగవాన్ చెప్పారు. చెరువులలో గేలంవేసి చేపలుపట్టేవారు గేలంకు ఒక మాంసపు ముక్కను తగిలిస్తారు. పైన మాంసపు ముక్క ఉంటుంది లోపల ముల్లు ఉంటుంది. మాంసపు ముక్క తిందామని చేప వస్తుంది. దానికి ఆ ముల్లు గ్రుచ్చుకొంటుంది. ఆ మాంసము ముక్కను చేపకు వేద్దామని గేలం వేసేవాడి ఉద్దేశంకాదు. ఆ మాంసంముక్కచేత ఆకర్షింపబడి చేప వస్తుంది, ఆ చేపను తీసుకొనివెళ్ళి దాకలో వేసుకొందామని వాడి ఉద్దేశం. గేలంవేసేవాడు చేపలను ఆకర్షించడానికి మాంసం ముక్కను ఎరగావేస్తున్నాడు. అలాగే మనం పూజచేసి, జపం చేసి దేవునికి మన పూజను, జపాన్ని ఎరగా వేస్తున్నాము. ఎందుకంటే మనకోరికను ఆయనద్వారా సిద్ధింపచేసుకోవటంకోసం. మన భక్తి అటువంటిది.

ఇది అకారణభక్తి కాదు. మనం అంతా పూజలు చేస్తున్నాము, జపాలు చేస్తున్నాము ఇది కారణభక్తా, అకారణ భక్తా అంటున్నారు. కారణభక్తి భక్తి కాదు అని ఆయన చెప్పటంలేదు. కారణభక్తివలన మీ కోరికలు నెరవేరవచ్చును కాని మోక్షం రాదు. అకారణభక్తివలన మోక్షం వస్తుంది. భగవంతునిమీద మనకు ప్రేమ ఉండాలి. కారణం కనబడకూడదు. కారణం కనిపించింది అనుకోండి అది నిజమైన ప్రేమ కాదు.

పుట్టినవాడు చనిపోతాడు, చనిపోయినవాడు పుడతాడు. నీవు పుట్టలేదు కదా నీకు ఈ గొడవ ఎందుకు అంటారు భగవాన్. దేహము పుడుతుంది, పెరుగుతుంది, మరణిస్తుంది. నీవు దేహము అయితే కంగారుపడవచ్చు. నీవు ఎవరు బ్రహ్మమే. దానికి పుట్టుకలేదు. దేనికైతే పుట్టుక లేదో అదే నువ్వు. ఈ మాటలు అన్నీ మనకు అనుభవంలో లేదు కాబట్టి ఇవి అన్నీ అసత్యము అనుకొంటున్నాము. మనం అందరము ఇక్కడ కూర్చొని మాటాడుకొంటున్నాము. ఇది వ్యవహారిక సత్యము. కాని భగవాన్ చెప్పినది పారమార్థిక సత్యము. గుడులు, తీర్థయాత్రలకు వెళ్ళటం, ఈ మీటింగులు ఇవి అన్నీ వ్యవహారిక సత్యములు. అంతిమ సత్యము బ్రహ్మముమాత్రమే.

నీ హృదయంలో ఉన్న నిజం చాలా simpleగా ఉంది. నీ జీవితంకూడా అంత simpleగా ఉంటే అది నీకు ఎరుకపడుతుంది అని భగవాన్ చెప్పారు. నీ అహంకారమునకు food supply అవ్వకుండా చూసుకో. మనలో ఏదో ప్రత్యేకత ఉంది. మనలను లోకంలో అందరూ గౌరవించాలి అనుకొంటే మనకు లోకవాసన ఉన్నట్లు. అప్పుడు వాడిమనస్సు అంతర్ముఖం అవ్వదు. పెద్దపాండిత్యం అక్కరలేదు, ధనం అక్కరలేదు, మామూలుగా రోజూ కట్టుకొనే చీరకంటే ఖరీదైన చీరకట్టుకొంటేనే ఆ రోజు మనలో ఏదో ప్రత్యేకత ఉంది అని మనకు అనిపిస్తుంది. బట్టలోకూడా అంత మాయ ఉంది. ఆడంబరమైన జీవితానికి అలవాటుపడితే మరల మనం మాయలో పడతాము అని రామకృష్ణుడు చెప్పారు. మీకు ఆర్థికంగా ఏదైనా అభివృద్ధి వచ్చింది అనుకోండి అప్పుడు మీమాటలలో, చేష్టలో, నడకలో తేడా వచ్చేస్తుంది. ఎందుచేతనంటే దానితో identify అవుతారు. ఇది అంతా మాయయొక్క లక్షణము.

మనం అరంచేసుకోవలసినది ఏమిటి అంటే మన భక్తిని పూజగదికే పరిమితం చేసుకోకూడదు. మనం చేసేపనిలోగానీ, మాట్లాడే మాటలలోగాని react అవ్వకుండా మనం చేసేపని పూజక్రింద చేస్తే, దేవునికోసం చేస్తే మనకు వికారములు కలుగవు. నీ దైనందిన జీవితంలో నీ మాటలోగాని, చేతలోగాని అహంభావనకు ఆహారం supply అవ్వకుండా చూసుకో. అప్పుడు అహంభావన దానంతట అదే ఎండిపోయి రాలిపోతుంది. ఏ వస్తువును అయితే ఎండబెడదామనుకొంటున్నావో దానిని రోజూ తడపకు. దాని వేరులో నీరు పోయవద్దు. అహంభావనను ఎండగడితే నీకు తెలియకుండానే దానంతట అదే రాలిపోతుంది. సాధనలపేరుమీద, పూజలపేరుమీద, జపాలపేరుమీద మీ అహంభావనను పెంచుకోకూడదు. అవిచేయవద్దు అని కాదు.

మీరు ఏదైనా మంచిపని చేసి ఇది అందరికీ తెలిసిపోవాలి అని అనుకొంటే దానివలన అహంభావన పెరిగిపోతుంది. పుణ్యంవస్తే రావచ్చును జ్ఞానంమటుకు రాదు. పుణ్యం అనుభవిస్తే పోతుంది. జ్ఞానం అలా కాదు. జ్ఞానం వలన మోక్షం వస్తుంది. మనస్సు, మాట, చేత ఇవి మూడూ నిదానంగా ఉండేటట్లు చూసుకోండి. పుణ్యం చేసినా, పాపం చేసినా ఈ మూడింటివలననే చేస్తాము. BMI ద్వారా నీ అహంకారము పెరగకుండా చూసుకోవాలి. BMI సహాయంతోనే నీ అహంకారమును పోగొట్టుకోవాలి. అహంకారముయొక్క మూలం తెలియకపోతే నీవు కోటిజన్మలు ఎత్తినా నీకు సత్యంగురించి తెలియదు అంటున్నారు భగవాన్. సత్యం నీ హృదయంలో ఉంది. అహంకారము పైన కప్పుక్రింద ఉంది. ఆ కప్పును తొలగిస్తేనేగాని నీ హృదయంలో సత్యం ఉన్నప్పటికీ అది ఎరుకపడదు. అందుచేత నీమాటద్వారా, చేతద్వారా నీ అహంభావన పలచబడేలాగ చూసుకోవాలి.

*